క్లుప్తంగా

అయ్యప్పలకు సద్ది వితరణ



ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు గ్రామంలోని హరిహరసుత అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం సద్ది వితరణ చేశారు. ముందుగా అయ్యప్పస్వామికి అర్చకుడు పూర్ణచంద్రశాస్త్రి ప్రత్యేక పూజలు, పంచామృతాలతో అభిషేకాలు చేశారు. విశేషంగా అలంకరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈసందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ గతనెలరోజులుగా అయ్యప్పస్వామి మాలధారులకు, భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మరో 11రోజులపాటు అన్నదానం నిర్వహిస్తామని చెప్పారు.

చింతలపూడిలో 'పొలం పిలుస్తోంది'



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని చింతలపూడి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల వ్యవసాయ అధికారిణి పి.శిరీష విచ్చేసి రైతులకు తదుపరి పంటగా వేయనున్న మొక్కజొన్న, జొన్న, పెసల పంటలకు ప్రధాన మంత్రి ఫసల్ యోజన (పంటల బీమా) పథకం గురించి వివరించారు. మొక్కజొన్నకు ఎకరాకు రూ.114, జొన్నకు రూ.48, పెసలు పండించే రైతులు రూ.45 ప్రీమియం చొప్పున సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో ఆధార్ మరియు భూమికి సంబంధించిన రికార్డులతో నమోదు చేయించుకోవాలని సూచించారు. ఏఈఓ రమేష్, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం



మంగళగిరి: పట్టణంలోని అన్వరీ ఇస్లామిక్ సెంటర్‌ను రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎంఎఫ్‌సీ) చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్ సందర్శించి కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఇస్లామిక్ సెంటర్‌లోని మహిళల కోసం ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ కేంద్రాన్ని సందర్శించారు. ఇస్లామిక్ సెంటర్‌లోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, విద్యా అభివృద్ధి కేంద్రాలను సందర్శించి ప్రశంసించారు. ఇస్లామిక్ సెంటర్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు సిలార్, షబ్బీర్, ఖదీర్, సంధాని, రఫీ పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



మేడికొండూరు: మండలంలోని పేరేచర్ల గుంటూరు బ్రాంచ్ కెనాల్‌లో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతి చెందిన వ్యక్తి వివరాలు లభించలేదు. ఎవరైనా హత్య చేసి కాలువలో పడేశారా, లేక ఆత్మహత్య చేసుకున్నాడా, కాలువలో ఈత దిగి మృతి చెందాడా అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. మృతుడి వయస్సు 46 సంవత్సరాలు ఉండి, ఎరుపు రంగులో ఉన్నాడు. వివరాలు తెలిసినవారు మేడికొండూరు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై షేక్ ఖాజీ బాబా తెలిపారు. పోలీస్ స్టేషన్ నెంబర్ 08641- 239233లో సంప్రదించాలని చెప్పారు.

షార్ట్ సర్క్యూట్‌తో పశువుల పాక దగ్ధం



ఫిరంగిపురం: మండలంలోని పొనుగుపాడు ఎస్సీకాలనీలో మంగళవారం ఉదయం షార్ట్ సర్క్యూట్ కారణంగా ఉయ్యాల వెంకటేశ్వర్లుకు చెందిన పశువుల పాక దగ్ధమైంది. ఈసంఘటనలో పాకలోని గేదెకు గాయాలుకాగా దాని నెలల వయస్సుగల దూడ మృతిచెందింది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ జె.ప్రసాదరావు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. గాయపడిన గేదెకు చికిత్సచేయాలని పశువైద్యాధికారి పీర్ అహ్మద్‌కు సూచించారు. సంఘటనకు సంబంధించిన వివరాలు నమోదు చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

రంగు పడుద్ది!

- ఆహార పదార్థాల్లో కల్తీల భయం
- ఆరోగ్యానికి పెను విపత్తుగా రంగుల మిశ్రమాలు
- జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యులు
- కొన్ని చిట్కాలతో నకి'లీలలు' తెలుసుకునే అవకాశం

తాడేపల్లిరూరల్: మసాలాల్లో కల్తీలు, టూత్‌పేస్టుల్లో రసాయనాలు, బిర్యానీల్లో రంగుల మిశ్రమాలు కలిపేస్తున్నారు. చూసుకోకుండా బయట ప్యాకెడ్ ఫుడ్స్ తింటున్నారా? ఖచ్చితంగా అనారోగ్యం పాలవడం ఖాయం. ఆహారపదార్థాల్లో ఏయే రూపాల్లో కల్తీలు జరుగుతాయనే విషయాన్ని గమనించడం కూడా కష్టంగా మారిన పరిస్థితులు.

పప్పు ధాన్యాలు – రంగులు



పప్పు ధాన్యాలను ఆకర్షణీయంగా కనబడడానికి కృత్రిమ రంగులతో పూత వేస్తారు. వీటిలో వున్న రసాయనాలు తిన్న తర్వాత మన శరీరంలోకి వెళ్లి క్యాన్సర్ వంటి అనారోగ్య కారకాలుగా మారతాయి. కల్తీ కనిపెట్టేందుకు కొద్దిమొత్తంలో పప్పు ధాన్యాలను తీసుకుని నీటిలో వేసి కొద్దిసేపు ఉంచాలి. నీటిరంగు మారితే కృత్రిమ రంగులు కలిసినట్లుగా గుర్తించవచ్చు. మారకపోతే స్వచ్ఛమైనవిగా పరిగణించవచ్చు.

కృత్రిమ పాలు.. ఇలా చేస్తే మేలు



పాలలో కల్తీని గుర్తించడానికి 5 మిల్లీ లీటర్ల పాలు తీసుకుని అందులో టింక్చర్ రెండు మూడు చుక్కలు వేయాలి. సహజసిద్ధమైన పాలు పసుపురంగులోకి మారతాయి. బ్రౌన్ కలర్‌లోకి మారితే రసాయనాలు కలిసినట్లుగా లెక్క. పాలపొడిలో రసాయనాలు, యూరియా కలిపే అవకాశం ఉంది. మనం ఇంట్లోనే పాలగిన్నెలో మన చూపుడు వేలు ముంచితే పాలు చేతికి అంటితే అవి స్వచ్ఛమైనవి. తడితడిగా నీళ్లలాగా అంటితే కృత్రిమ పాలుగా భావించవచ్చు.

అంతా కల్తీమయం..!

మనం నిద్ర లేచింది మొదలు పడుకునే వరకు రోజువారీగా అనేక వస్తువులు ఉపయోగిస్తుంటాం. టూత్ పేస్టు నుంచి ఇంట్లో సామాన్లు, నూనెలు, పప్పులు, కూరగాయలు, బిస్కెట్లు, తినుబండారాలు, ధరించే దుస్తులు, ఆభరణాలు, మార్కెట్‌లో కనిపించే చాలా వస్తువులు కల్తీలు, నకిలీలమయమే. ప్యాకెడ్ ఫుడ్ నుంచి ఆహార పదార్థాలు, తాగే నీరుతో సహా సమస్తం కల్తీ మయం. ఇవే కాదు మందులు, పెట్రో ఉత్పత్తులు ఇలా ఏ వస్తువు కొన్నా కల్తీల బారిన పడాల్సి వస్తుంది.

కూరగాయలు సురక్షితమేనా..?



కూరగాయలకు కూడా రసాయనాలు పూయడం ఇటీవల పెరిగింది. చిన్న దూదిని నీళ్లలో ముంచి దానితో కూరగాయల పైభాగాన్ని రుద్దితే అది ఎలాంటి రంగు మారకుండా ఉంటే అవి సహజమైనవి. ఆరోగ్యానికి ఎలాంటి ప్రమాదం ఉండదు. దూది ఆకుపచ్చ రంగులోకి మారితే రంగుల కల్తీ జరిగినట్లు నిర్ధారించవచ్చు. కల్తీ కూరగాయలను తింటే అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంది.



రోడ్డు పక్కన అమ్మే తినుబండారాలు

మీ ఉప్పులో కల్తీ ఉందా..?



మనం తినే ఉప్పులోనూ కల్తీ జరుగుతుంది. దీనిని కనుగొనడానికి బంగాళ దుంప ముక్కను కట్ చేసి ఉప్పు వేసి నిమిషం పాటు వేచి చూడాలి. నిమ్మరసం రెండు చుక్కలు వేసినా తెలుస్తుంది. అయోడైజ్డ్ ఉప్పు నీలిరంగులోకి మారుతుంది. సాధారణ ఉప్పు ఎలాంటి రంగులోకి మారదు.

ఆహార పదార్థాల కల్తీతో పెను ప్రమాదం..



ఆహార పదార్థాల్లో విషపూరిత పదార్థాలు, యూరియా, లెడ్ క్రోమైట్, కృత్రిమ రంగులు వంటి సాధారణ కల్తీలు విషపూరితంగా మారతాయి. బ్యాక్టీరియల్ కాలుష్యం, కల్తీ ఆహారం హానికరమైన సూక్ష్మ జీవులను కలిగి ఉంటుంది. ఇది అంటువ్యాధులు, ఇతర వ్యాధులకు దారితీస్తుంది. ఒక్కోసారి ఫుడ్ పాయిజనింగ్ జరిగి ప్రాణాలకే ప్రమాదం రావచ్చు. అలర్జీలు పెరిగిపోతాయి, గ్యాస్‌తో పాటు కడుపునొప్పి వంటి సమస్యలతో పాటుగా కడుపులో రుగ్మతలు వంటివి వస్తాయి. కల్తీ వస్తువులను ఎక్కువగా వినియోగిస్తే క్యాన్సర్, కాలేయం, మూత్రపిండాల సమస్యలు, హార్మోన్లలో అసమతుల్యత, రోగ నిరోధక శక్తి తగ్గిపోవడం వంటి దుష్ప్రభావాలు ఉంటాయి.

– డాక్టర్ మానస, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు, డ్రైవర్స్ కాలనీ

సబ్ డివిజనులో 1,034 టన్నుల ధాన్యం కొనుగోలు

వ్యవసాయశాఖ ఏడీఏ ఉషారాణి

తెనాలి: వ్యవసాయ సబ్‌డివిజనులో ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయని, రైతులకు సంబంధిత డబ్బులను వారి ఖాతాల్లో జమ చేస్తున్నట్లు వ్యవసాయ సహాయ సంచాలకులు ఉషారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌డివిజనులోని కొల్లిపరలో 130 మంది రైతుల్నుంచి 735.4 మెట్రిక్ టన్నులు, దుగ్గిరాలలో తొమ్మిదిమంది రైతుల ధాన్యం 70 మెట్రిక్ టన్నులు, తెనాలిలో 31 మంది నుంచి 229.44 టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు తెలిపారు. ఇందుకు సంబంధించి కొల్లిపరలో 110 మంది రైతులకు రూ.1.42 కోట్లను బ్యాంకు ఖాతాలకు జమచేశామని తెలిపారు. దుగ్గిరాలలో నలుగురు, తెనాలిలో 15 మంది రైతులకు నగదు జమయిందని వివరించారు. మూడు మండలాల్లో కలిపి 170 మంది రైతుల దగ్గర్నుంచి 1034.84 టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, వారికి రావాల్సిన రూ.2.12 కోట్లకుగాను రూ.1.75 కోట్లు జమ చేసినట్టు చెప్పారు.

వేధిస్తున్నాడని ప్రియురాలి ఫిర్యాదు

తెనాలిరూరల్: ఇంటికి రావద్దన్నా వచ్చి వేధిస్తున్నాడంటూ ప్రియుడిపై ప్రియురాలు ఫిర్యాదు చేసింది. వివరాలు... పట్టణ నాజరుపేటకు చెందిన దివ్య, ప్రియుడు సతీష్‌తో గతంలో సహజీవనం చేసింది. కొంత కాలం తర్వాత అతని తీరు నచ్చక దూరం పెట్టింది. తన వద్దకు రావద్దని చెప్పినా అతను ఇంటికి వెళుతుండడంతో పోలీసులను ఆశ్రయించింది. వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

రక్త నమూనాల సేకరణ



తెనాలిరూరల్: బోద వ్యాధి నిర్మూలనకు చేపడుతున్న చర్యల్లో భాగంగా మలేరియా విభాగం అధికారులు తెనాలిలో రక్త నమూనాలను మంగళవారం సేకరించారు. జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం ఆదేశాల మేరకు పట్టణ బుర్రిపాలెం రోడ్డులోని బీసీ కాలనీలో మంగళవారం రాత్రి రక్త నమూనాలు సేకరించారు. కాలనీలో ఇంటింటికి తిరిగి సేకరిస్తామని అసిస్టెంట్ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ గుద్దంటి రవికుమార్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, హెల్త్ అసిస్టెంట్ మున్నంగి రత్నాకరరావు, షేక్ బాషీద్, ఏఎస్ఎం కొండమ్మ, ఆశ కార్యకర్త రాణి పాల్గొన్నారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

తెనాలిరూరల్: ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త వేధిస్తున్నాడని భార్య పోలీసులను ఆశ్రయించింది. పట్టణానికి చెందిన సమీరా, చేబ్రోలు మండలం రెడ్డిపాలేనికి చెందిన జానీ 2021లో ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. సమీరా మైనర్ కావడంతో జానీపై పోక్సో కేసు నమోదైంది. మేజర్ అయ్యాక తిరిగి వివాహం చేసుకున్నారు. అయితే తనను మానసిక, శారీరక వేధింపులకు గురి చేస్తున్నాడని భర్తపై ఫిర్యాదు చేసింది. వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

కృష్ణనగర్ దేవాలయంలో చోరీ

లక్ష్మీపురం: స్థానిక కృష్ణ నగర్‌లోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో చోరీ జరిగింది. అర్ధరాత్రి ఆలయ తాళాలు పగులగొట్టి అమ్మవారి ముక్కుపుడక, హుండీలోని రూ. 5వేలు నగదు చోరీ చేసిన ఘటన సోమవారం అర్ధరాత్రి జరిగింది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక కృష్ణనగర్‌లోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో గుర్తు తెలియని వ్యక్తి మాస్క్ ధరించి గేటు తాళాలు పగులగొట్టి దేవాలయంలోకి ప్రవేశించారు. దేవాలయంలో అమ్మవారి ముక్కుపుడక, ఒక గ్రాము బంగారంతోపాటు, హుండీలో ఉన్న రూ. 5వేలు నగదు చోరీ చేసి పరారయ్యాడు. మంగళవారం ఉదయం దేవాలయానికి వచ్చిన దేవాలయ నిర్వాహకులు గమనించి పట్టాభిపురం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్‌టీం పలు కీలక ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళల రక్షణ కోసం 'మహిళ - మీకోసం'

లక్ష్మీపురం: మహిళలకు సమస్యలు ఉంటే తక్షణమే మహిళల రక్షణ కోసం ' మహిళ–మీకోసం' 112, 974641464 నంబర్లకు సమాచారం తెలియజేయాలని అరండల్‌పేట పోలీసులు తెలిపారు. మంగళవారం అరండల్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు వెస్ట్ సబ్‌డివిజన్ డీఎస్పీ జయరామ్‌ప్రసాద్ ఆదేశాలతో అరండల్‌పేట పోలీసు స్టేషన్ సీఐ వీరాస్వామి పోలీసు స్టేషన్ పరిధిలోని కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు, మహిళల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే వెంటనే 112, మహిళ – మీకోసం నంబరుకు సమాచారం తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు, పోలీసు సిబ్బంది తదితరు పాల్గొన్నారు.

ఘనంగా విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం



దుగ్గిరాలలో బహుమతులు అందజేస్తున్న ఎంఈఓలు శ్రీనివాసరావు, కె.లక్ష్మీనారాయణరావు



పోలకంపాడులో మ్యూజికల్ చైర్స్ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పోలకంపాడు మండల ప్రజాపరిషత్ (ఏపీ) భవిత కేంద్రంలో ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ డీఈఓ శాంతకుమారి విచ్చేసి దివ్యాంగుల పిల్లలకు డ్రాయింగ్, క్యారమ్స్, రన్నింగ్, కుర్చీల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా శాంతకుమారి మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు, బ్రెయిలీ బుక్స్ మొదలైన పరికరాలను ప్రభుత్వం అందజేస్తోందని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతిరోజు భవిత సెంటర్‌కు పంపించాలన్నారు. ఎంఈఓ డి.నాగేశ్వరరావు మాట్లాడుతూ బుద్ధి మాంద్యం గల థామస్ ఆల్వా ఎడిసన్ బల్బ్‌ను కనిపెట్టాడని, లూయీ బ్రెయిలీ అంధుల లిపిని కనుగొన్నారని తెలిపారు. భవిత సెంటర్‌లో ఫిజియో థెరపీ, స్పీచ్ థెరపీ సేవలు ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం వివిధ క్రీడల్లో గెలుపొందిన వారికి జాషువా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శ్రీనివాసరావు నోట్ బుక్స్, డ్రాయింగ్ బుక్స్, కలర్ పెన్సిళ్లు, పెన్సిల్ బాక్సులు, సర్టిఫికెట్లు అందజేశారు. వడ్డేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అసిస్టెంట్ జోజప్ప భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులు బి.హరికృష్ణ, వి.సునీత కుమారి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దుగ్గిరాలలో..

దుగ్గిరాలలోని భవిత కేంద్రంలో విద్యార్థులకు ఆటల పోటీలను ఎంఈఓలు కె. శ్రీనివాసరావు, కె.లక్ష్మీ నారాయణరావులు ప్రారంభించారు. క్యారమ్స్, రన్నింగ్, కుర్చీల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. హెచ్ఎం గౌసియా బేగం, ఐఈడీఎస్ ఉపాధ్యాయులు విజయలక్ష్మి, జ్యోతి, సరస్వతి, శారా గ్రేస్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

215 మందికి వైద్యపరీక్షలు



వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యురాలు శ్వేత

ఫిరంగిపురం: ఆభా(ఆయుష్మాన్ భారత్)ఐడీలతో ఏఎన్‌సీలతో ప్రతి ఒక్కరూ ఆరోగ్యసేవలు పొందవచ్చని వైద్యురాలు శ్వేత అన్నారు. మండల కేంద్రంలోని సచివాలయం-3 పరిధిలోని వైఎస్సార్ హెల్త్ సెంటర్‌లో ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. 215 మందికి వివిధ రకాల వైద్యపరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. ఈసందర్భంగా శ్వేత మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఆరోగ్యసిబ్బంది ఇంటింటికి తిరిగి ఆభా ఐడీలలో వ్యక్తియొక్క ఆరోగ్యసమాచారం నమోదు చేస్తున్నారని చెప్పారు. దీని ద్వారా పూర్తి స్థాయిలో ఆవ్యక్తి యొక్క ఆరోగ్యసమాచారం తెలుసుకొని అవసరమైన సమయంలో వైద్య సేవలు అందించేందుకు ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఎంఎల్‌హెచ్‌పీ గోవర్ధన్, ఏఎన్ఎం భారతీజ్యోతి, 104 సిబ్బంది విజయ్‌కుమార్, సింగరాజు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో గంజాయి పట్టివేత

ఇద్దరు యువకులు అరెస్ట్



గంజాయితో పట్టుబడిన వారితో ఎక్సైజ్ సీఐ వీరాంజనేయులు, సిబ్బంది

తాడేపల్లి రూరల్: మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను మంగళగిరి ఎక్సైజ్ పోలీసులు మంగళవారం పట్టుకుని కోర్టుకు హాజరు పరిచారు. సీఐ వీరాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం రైల్వే గేటు వద్ద గంజాయి విక్రయించేందుకు అదే గ్రామానికి చెందిన ఎస్‌కె బాజీబాబు ఉన్నాడని వచ్చిన సమాచారం మేరకు అక్కడకు వెళ్లిన తమ సిబ్బంది బాజీబాబును తనిఖీ చేయగా అతని వద్ద 130 గ్రాముల గంజాయి దొరికిందన్నారు. చిర్రావూరులో సోహావ్ లక్ష్మణ్ సింగ్ అనే వ్యక్తి వద్ద గంజాయి ఉందని సమాచారం రావడంతో అక్కడకు వెళ్లి తనిఖీ చేయగా అతని నివాసంలో 100 గ్రాముల గంజాయి లభించిందని, వీరిద్దరు ఎటువంటి పనులు చేయకుండా చెడు వ్యసనాలకు అలవాటు పడి గంజాయి విక్రయిస్తున్నారని ఆయన తెలిపారు. ఎవరైనా గంజాయి అమ్మినట్లు, కొనుగోలు చేసినట్లు, సేవించినట్లు సమాచారం తెలిస్తే 9440902469 నెంబరుకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు. గంజాయి అమ్ముతున్న వారిని చాకచక్యంగా పట్టుకున్న ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎస్ఐ కె.రవికుమార్, హెడ్ కానిస్టేబుల్ జి.సందీప్, కానిస్టేబుళ్లు బి.శ్రీనివాస్, కె. రమేష్, డి.ఆశీర్వాదంలను వీరాంజనేయులు అభినందించారు.

స్వాములకు సద్ది వితరణ ప్రారంభం



బిక్ష చేస్తున్న అయ్యప్పలు, భవానీలు

కొల్లిపర: కొల్లిపర శ్రీ మణికంఠ సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు, భవానీ స్వాములకు అన్నప్రసాద వితరణ మంగళవారం ప్రారంభించారు. శ్రీగంగా పార్వతి సమేత ముక్తేశ్వర స్వామి దేవస్థానంలో సేవా సమితి ప్రెసిడెంట్ ఆరిమండ శివరామకృష్ణారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. డిసెంబర్ 3 నుంచి జనవరి 12వ తేదీ వరకు జరుగు నిత్య అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శివరామకృష్ణారెడ్డి మాట్లాడుతూ సేవా సమితి కొల్లిపర మండలంలోని అయ్యప్ప స్వాములు అందరూ కలసి 2022లో స్థాపించటం జరిగిందని అప్పటి నుంచి సేవా సమితి ద్వారా ప్రతి ఏడాది 40 రోజుల పాటు అయ్యప్ప స్వాములకు, భవానీ స్వాములకు నిత్య అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయంలో అయ్యప్ప సామికి ప్రత్యేక భజనలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ జంగా శంకరెడ్డి, సెక్రటరీ కొల్లి అంజిరెడ్డి, వైస్ సెక్రటరీ బొంతు వెంకటరెడ్డి(దత్తు స్వామి), ట్రెజరీ కొల్లి రఘునాథరెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ భీమవరపు రాజశేఖరరెడ్డి , ఎగ్జిక్యూటివ్ మెంబర్లు భీమవరపు శివరామిరెడ్డి, బొల్లిముంత అంకమ్మరావు, చింతా వీరాంజనేయులు, అయ్యప్ప స్వాములు, భవానీ స్వాములు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ సిబ్బంది తీరుపై విచారణ



ప్రజలతో మాట్లాడుతున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ శ్రావణ్ కుమార్

మున్నంగి(కొల్లిపర): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సిబ్బందిపై వచ్చిన ఫిర్యాదులపై మంగళవారం జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ శ్రావణ్ కుమార్ విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన ఎం.సుబ్బారావు చేసిన ఫిర్యాదులపై ప్రజల అభిప్రాయాలు స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలు రాత్రి సమయంలో రైతులకు పాముకాటు, చిన్న చిన్న సమస్యలు వచ్చిన సమయంలో అత్యవసరమైనప్పుడు వైద్యం కోసం దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని, రాత్రి సమయంలో గర్భిణులకు నొప్పులు వచ్చి డెలివరీ సమయంలో వైద్యులు లేక తెనాలి తీసుకు పోవాల్సివస్తుందని, ఎటువంటి ఆపరేషన్లు జరగటం లేదు, విద్యార్థులు వివిధ వాటికి సంబంధించి సంతకాలు తీసుకోవాల్సి వచ్చిన సమయంలో వారికి సహకరించటం లేదన్న ఫిర్యాదులపై విచారణ చేపట్టారు.

చిన్నారులకు అనుబంధ ఆహారాన్ని అందించండి

ఇన్‌చార్జి జిల్లా మలేరియా అధికారి దారావత్ రాజు నాయక్



మాట్లాడుతున్న ఇన్‌చార్జి జిల్లా మలేరియా అధికారి దారావత్ రాజు నాయక్

తెనాలిఅర్బన్: చిన్నారులకు పాలతో పాటు అనుబంధ ఆహారాన్ని అందించాలని ఇన్‌చార్జి జిల్లా మలేరియా అధికారి దారావత్ రాజు నాయక్ సూచించారు. ఆశ డేను పురస్కరించుకుని పాత ప్రభుత్వ వైద్యశాలలో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు మంచి పోషక విలువతో కూడిన ఆహారాన్ని అందిస్తే ఆరోగ్యకరంగా ఉంటారని చెప్పారు. జిల్లా ఉప వైద్య ఆరోగ్యాధికారిణి డాక్టర్ ఈ అన్నపూర్ణ మాట్లాడుతూ తల్లిపాల వల్ల చిన్నారులలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. సమావేశంలో డాక్టర్ దేవరపల్లి సుభాష్ రమాదేవి, సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకరరెడ్డి, సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, వంగల పున్నారెడ్డి పాల్గొన్నారు.

మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్య

పట్నంబజారు: అనారోగ్య కారణాలతో మనస్తాపానికి గురైన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై కేసు నమోదైంది. పాతగుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాతగుంటూరులోని లక్ష్మీనగర్‌లో నివాసం ఉండే పేర్న ఏడుకొండలు (55) గత కొంతకాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమారుడు పవన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

లక్ష్మీపురం: ఉదయం వాకింగ్‌కు వెళ్లి బయటకు వచ్చి చూసేసరికి ద్విచక్ర వాహనం కనిపించక పోవడంతో పరిసర ప్రాంతాల్లో వెతికి పట్టాభిపురం పోలీసులకు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉద్యోగనగర్ ప్రాంతానికి చెందిన ఆలూరి తిరేష్ వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. నవంబరు 21న రోజు మాదిరిగానే గుజ్జనగుండ్లలోని వాకింగ్ ట్రాక్ వెళ్లి వాకింగ్ చేసుకునేందుకు బండి పార్కింగ్ చేసి వాకింగ్ పూర్తి చేసుకుని బయటకు వచ్చి చూసేసరికి ద్విచక్రవాహనం కనిపించలేదు. దీంతో చోరీకి గురైనట్లు గుర్తించి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విభిన్న ప్రతిభావంతుల హక్కులు కాపాడాలి

కొల్లిపర: విభిన్న ప్రతిభా వంతుల అభ్యున్నతికి, వారి హక్కులు కాపాడడానికి ప్రతీ ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం కొల్లిపర గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాల(ఆర్)లో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విభిన్న ప్రతిభా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి , గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఎంఈఓ 1, 2 జి.సాల్మన్‌రాజ్, కె.రూన్సీలత, భీమవరపు వేణుగోపాలరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.